

బ్రహ్మోత్సవాలపై సమావేశం



ప్రజాశక్తి- ఐరాల: శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం 2025 వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం శ్రీమణికంఠేశ్వర స్వామివారి ఆలయంలో 14 గ్రామాల ఉభయదారులతో బ్రహ్మోత్సవాలపై సమావేశం నిర్వహించడం జరిగింది. దేవస్థానం ఈవో పెంచల కిషోర్ మాట్లాడుతూ ఉభయదారు సహకారంతో బ్రహ్మోత్సవాలు విజయవంతంగా నిర్వహించుకుందామని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సహకరించాలని కోరారు. ఉభయదారుల సంఘం అధ్యక్షుడు ఈశ్వర్ బాబు, దేవస్థానం మాజీ చైర్మన్లు మోహన్ నాయుడు, జగన్నాథ రెడ్డి, మణి నాయుడు, మోహన్ రెడ్డి, ఈఈ వెంకట నారాయణ, ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, ప్రసాద్, ధనంజయ, ధనపాల్ పాల్గొన్నారు.

సంపద కరిగింది.. చెత్త మిగిలింది..!

- నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు


కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రతి పంచాయతీలో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. కొన్నిచోట్ల ప్రారంభానికి ముందే అవి శిథిలావస్థకు చేరాయి. సిబ్బందికి నెలనెలా జీతాలు చెల్లించినా వాటి ఫలాలు ప్రజలకు చేరడం లేదు. ఎక్కడ చూసినా మురుగు కాలువలు, వీధుల్లో చెత్త, ప్లాస్టిక్, గాజు సీసాలు పేరుకుపోతున్నా పట్టించుకున్న దాఖలాల్లేవు.



నిరుపయోగంగా ఉన్న ముడిపల్లి చెత్త సంపద కేంద్రం

ప్రజాశక్తి- విజయపురం (నగరి) : చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణానికి ఉపాధిహామీ నిధులు ఖర్చు చేశారు. ఒక్కో కేంద్రానికి రూ.20లక్షలు వెచ్చించారు. కేంద్ర ప్రభుత్వం బ్యాటరీ బండ్లు, మేజర్ పంచాయతీలకు ట్రాక్టర్లు, జనాభా ఎక్కువగా ఉంటే అదనపు ట్రాక్టరు, గాజు సీసాలు పొడి చేయడానికి ప్రత్యేక యంత్రాలు సమకూర్చడంతోపాటు హరిత రాయబారులను నియమించింది. వీరికి కేంద్ర ప్రభుత్వమే జీతాలు చెల్లించింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం హరిత రాయబారులను క్లీన్ మిత్రలుగా పేరు మార్చింది. వీధుల నుంచి చెత్తను సేకరించి, తడి, పొడి చెత్తతోపాటు గాజు, పెంకు, ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేస్తారు. వాటిని వేర్వేరు తొట్టెలతో వేసి కుళ్లించి, వానపాములతో సేంద్రియ ఎరువు తయారు చేసి, రైతులకు అందజేయాలి కానీ ఇక్కడ అలాంటి ఏం లేదు.

మండలంలోని ఎస్‌డబ్ల్యూపిసి 21 అందులో 15 చెత్తసేకరణ కేంద్రాలు తేరణి, దామరపాకం, నంబకం, మేలపట్టు, మెట్టపాలెం, బీర కుప్పం, బిఎన్ఆర్ పేట, ఓజీ కుప్పంలో ఉన్న అరాకొరగా వినియోగంలో ఉన్నాయి. రెండు కేంద్రాలు వికేర్ పురం, ముడిపల్లి షెడ్డులున్నాయి తప్ప పైన ఉండాల్సిన రేకులు లేవు. ఈ నాలుగు పంచాయతీల్లో వినియోగ కేంద్రాలు లేవు, కృష్ణ రామాపురం, మూలనత్వం, దేసురాగరం, నంబకం



గుండ్రాజ కుప్పంలో చెత్త పోసే తొట్టెలు విరిగిపోయి ఉన్న దృశ్యం

నిరుపయోగంగా ఉన్న మాంగాడు చెత్త సంపద కేంద్రం

అయినా రోజురోజుకి ఈ వ్యవస్థ అధికారుల నిర్లక్ష్యం వల్ల కంటుపడుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషితో పునర్నిర్మాణం చేసి మళ్లీ చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని వాడకంలో తేవాలని పంచాయతీలో అభివృద్ధి కోసం కృషి చేయాలని ఎంతో అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, జిల్లాస్థాయి అధికారుల నుండి ఆదేశాలు వచ్చినా కూడా మండలస్థాయి అధికారులు నుండి ఎలాంటి స్పందన, చర్యలు తీసుకోకపోవడం శోచనీయంగా మారింది. చెత్త నుండి సంపద సృష్టించి వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి వినియోగపడుతుందని ఆశయంతో గత ప్రభుత్వం చెత్త సంపద కేంద్రాల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. అధికారుల అలసత్వంతో వీటిపై ప్రత్యేక దృష్టి సారించకపోవడం వల్ల అవి మూలకు చేరి నిరుపయోగంగా పడి ఉన్నాయి.

మండలంలోని 21 పంచాయతీల్లో ఉపాధి హామీ ద్వారా చెత్త సంపద కేంద్రాలు నిర్మించాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ ఇక్కడి అధికారుల నిర్లక్ష్యం వల్ల ఎక్కడా పూర్తిస్థాయిలో చెత్త సంపద కేంద్రాల నిర్మాణ పనులు చేపట్టలేదని స్థానికుల నుంచి విమర్శలు వెలువెత్తుతున్నాయి. తదితర గ్రామాల్లో చెత్తసంపద కేంద్రాలు ఏర్పాటు చేసి వీటి నిర్వహణకు షెడ్ మిత్రులు, క్లాప్ మిత్రులు ప్రభుత్వం నియమించి వీరికి స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా వేతనాలు చెల్లిస్తున్నారు. వీరు గ్రామంలోని చెత్తను సేకరించి చెత్త సంపద కేంద్రానికి తరలిస్తారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ ఆశయానికి గండి కొడుతుందన్నందుకు ఇది నిదర్శనమని చెప్పవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్ధాంతరంగా నిలిచిపోయిన చెత్త సంపద కేంద్రాలు నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

రౌండ్ టేబుల్ సమావేశంలో సిఐటియు- ఏఐటియుసి పిలుపు



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాలు ఉద్యోగ ఫెడరేషన్లు ఈనెల 9వ తేదీన చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను జిల్లాలో జయప్రదం చేయాలని సిఐటియు, ఏఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో సిఐటియు- ఏఐటియుసి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండన్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దుచేసి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేయడానికి లేబర్ కోడ్స్ తీసుకురావడం దుర్మార్గమన్నారు. స్కీం వర్కర్లకు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోతుందని తెలిపారు. వర్కింగ్ జర్నలిస్టులకు కూడా భద్రత లేకుండా పోతుందని తెలిపారు. దేశంలోని అన్ని వర్గాల కార్మికులు ప్రజలకు సంబంధించిన అంశాలపై దాడి జరగబోతుందని గతంలో 18 సమ్మెలు జరిగిన ఆ సమ్మెలకు ఈ సమ్మెకు ప్రాధాన్యత ఉందని కార్మికులు ప్రజలు ఈ సమ్మెలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరిక చేసే విధంగా జయప్రదం చేయాలని కోరారు. గల్లి నుండి ఢిల్లీ వరకు ఈ సమ్మెలో పాల్గొనాలని, జిల్లాలో కూడా అన్ని కేంద్రాల్లోనూ ప్రదర్శనలు, మానవవహారాలు చేసి కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను రాష్ట్రంలో ఉన్న కూటమి పార్టీలు మద్దతు ఇవ్వడం దారుణమన్నారు. కార్మికులు, ఉద్యోగుల పక్షాన ఉన్నామంటూ చెబుతున్న తెలుగుదేశం, జనసేన, వైఎస్ఆర్సిపి సమ్మెకు మద్దతు ఇచ్చి కార్మికుల అండగా నిలబడాలని అన్నారు. ఇప్పటికైనా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాపాడాలని లేని పక్షంలో జరిగే పరిణామాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు బాలసుబ్రమణ్యం, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజు, నాయకులు దాసరి చంద్ర, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

పంటలపై ఒంటరి ఏనుగు దాడి



ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలోని ననియాల అటవీ సమీప ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్న పంటలను ఒంటరి ఏనుగు ధ్వంసం చేస్తూ హల్‌చల్ చేస్తుంది. శనివారం రాత్రి గ్రామ సమీపంలోని టమాటా, మామిడి, పశుగ్రాసం తిన్నంత తిని తొక్కి నాశనం చేయడమే కాక వ్యవసాయ పరికరాలు ధ్వంసం చేసింది. నిత్యం అటవీ సమీప పంట పొలాలపై ఏనుగు దాడులు చేస్తున్నాయి, అటవీ అధికారులు, ట్రాకర్లు టపాకాయలు, బాణాసంచా పేల్చి అటవీ ప్రాంతంలోకి మళ్లించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా చీకటి పడితే ఏదో ఒక ప్రాంతంలో ప్రత్యక్షమై పంటలపై విరుచుకుపడుతున్నాయి ఏనుగులు. రైతులకు పంట చేతికి వచ్చే సమయంలో ఒంటరి ఏనుగు దాడులు చేసి అపార నష్టం కలిగిస్తున్నాయి. ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకొని ఏనుగు దాడులను అరికట్టాలని రైతులను కోరుతున్నారు.

నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఈనెల 7వ తేదీన సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో 7వ తేదీ సోమవారం ఉదయం 9 .30గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో కూడా వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చునని, అలాగే నమోదైన అర్జీల గురించి వాటి స్థితి దానికి సంబంధించి ఇన్ఫర్మేషన్ ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 (డబల్ వన్ డబల్ జీరో)కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులు దూరం

ఇంటర్వ్యూ

- పశుసంవర్ధశాఖ జాయింట్ డైరెక్టర్ అబ్దుల్ ఆరిఫ్



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

జంతువుల నుంచి మనుషులకు వ్యాధుల సక్రమించకుండా ఉండాలంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధశాఖ జాయింట్ డైరెక్టర్ అబ్దుల్ ఆరిఫ్ తెలిపారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జంతుల నుంచి మనవాళికి సక్రమించే వ్యాధులు, వాటి నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలిపారు. జంతువులతో మనవుని సహచర్యం ఎంతో ప్రాచీనమనైనదని, ప్రతి మనిషి పౌష్టికాహార అవసరాలు పశుపక్ష్యాదుల నుండీ ఉత్పత్తి అయ్యే పాలు, గుడ్లు మాంసంపై ఆధారపడి ఉన్నారని తెలిపారు. మనుషులు పశువుల సహచర్యంతో జోనోటిక్ వ్యాధులు సంక్రమిస్తాయని, జంతువుల నుండీ మనుషులకు, మనుషుల నుండీ జంతువుకు సక్రమించే వ్యాధులను జోనోటిక్ వ్యాధులు అంటారని తెలిపారు. ఈ వ్యాధులు సుమారు 280 రకాల వరకు గుర్తించబడ్డాయి. లూయిస్ పాశ్చర్ అను శాస్త్రవేత్త మొదటిసారి 1885 జూలై 6వ తేదీ పిచ్చికుక్క కాటుకు గురైన బాలునికి వ్యాధి రకుండా వ్యాధి నిరోధక టీకా మందు విజయవంతంగా ఇచ్చినందున ఆరోజు నుండీ ప్రపంచ జోనోసిస్ దినోత్సవం జరుపుకోవడం జరుగుతోంది.

ప్రజాశక్తి : ముఖ్యమైన జోనోటిక్ వ్యాధులు ఏవి..?

జేడీ: జోనోటిక్ వ్యాధులు జంతువుల నుండీ మనుషులకు వ్యాపిస్తాయి. వీటిలో ముఖ్యమైనవి వైరల్, బ్యాక్టీరియల్, పారాసైటిక్‌గా మూడు విభాగాలుగా గుర్తించడం జరిగింది. వైరల్ విషయానికి వస్తే రేబిస్, మెదడువాపు, అమ్మవారు (పాక్స్) బర్డ్‌ఫ్లూ, స్వైన్‌ఫ్లూ, ఎబోలా, నిఫా ఉన్నాయి. బ్యాక్టరియల్ వ్యాధులుగా అంత్రాక్స్, బ్రూసెల్లోసిస్, లెప్టోస్పైరోసిస్, లిస్టిరియోసిస్, క్షయ ఇక పారాసైటిక్ విషయానికి వస్తే అమీబియాసిస్, బాలాంటెడియోసిస్, సోర్యోసిస్టోసిస్, టాక్సోప్లాస్మోసిస్, టెనియాసిస్, ట్రైకినెల్లోసిస్, ఆస్కాఇరియాసిస్, స్కెబిస్ (గజ్జి) తామర, మైడాటెడోసిస్ అంకైలోస్టోమియోసిస్ ఉన్నాయి.

ప్రజాశక్తి: రేబిస్ వ్యాధి ఎలా సోకుతుంది..?

జేడీ: రేబిస్ వ్యాధి పిచ్చి కుక్కకాటు ద్వారా వ్యాప్తిచెందే అతి భయకంర వ్యాధి. ఈ వైరస్ వ్యాధిగ్రస్తమైన కుక్క చొంగలో ఉండి కాట్ల ద్వారా శరీరంలోకి ప్రవేశించి వ్యాధిని కలుగజేస్తుంది. కాటుకు గురైన వెంటనే గాయాలను సబ్బు నీటితో శుభ్రంగా కడిగి ప్రథమ చికిత్స పద్ధతులను పాటించి డాక్టర్‌ను సంప్రదించి యాంటీ రేబిస్ టీకాను కోర్సు ప్రకారం చేయించుకోవాలి. పెంపుడు కుక్కలకు రేబిస్ నిరోధక టీకాలనుప్రతి సంత్సవరం వేయించాలి.

ప్రజాశక్తి: ఇటీవల బర్డ్‌ఫ్లూ వ్యాధిపై అనేక అనుమానాలున్నాయి. ఈ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది..?

జేడీ: ఈ వ్యాధి హెచ్ 5ఎన్1 రకం వైరస్ వలన ముఖ్యంగా శీతాకాంలో కోళ్ళలో వ్యాప్తి చెంది అధిక శాతంలో మరణాలు సంభవిస్తాయి. ఈ వ్యాధి వలన పక్షుల ద్వారా వ్యాప్తిచెందుతుంది. ఈ వైరస్ వేగంగా రూపాతరం చెందుతుంది. కోళ్ళ నుండీ మనుషులకు వ్యాపించే అవకాశమున్నప్పటికీ మన దేశంలో ఇప్పటి వరకు బర్డ్‌ఫ్లూ వ్యాధి వల్ల మనుషులు మరణించిన ఘటనలు చోటు చేసుకోలేదు. గుడ్లు, మాంసం బాగా ఉడిగించి తినాలి, ఎక్కవ వైరస్ చూపే ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రస్తుతం టీకాలు లేవు. బయోసెక్యూరిటీ జాగ్రత్తలు పాటించడం ద్వారా వ్యాప్తిని అరికట్టవచ్చు.

ప్రజాశక్తి: పెంపుడు జంతువులు, పక్షుల నుండీ మనుషులకు వ్యాధులు సోకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..?

జేడీ: పెంపుడు జంతులు, పక్షుల నుండీ మనుషులకు సోకే వ్యాధులు 280 రకాలున్నాయి. వీటి నుండీ మనల్ని మనం కాపాడుకోవాలంటే వ్యక్తిగత శుభ్రత పాటించాలి, మరగకాసిన పాలను, బాగా ఉడకపెట్టిన గుడ్ల, మాంసాన్ని మాత్రమే తీసుకోవాలి. కలుషితమనైన నీటిని తాగరాదు, ఇంటి పరిసరాలను పరిశ్రుంగా ఉంచుకోవాలి. పశుల కొట్టం చూట్టూ నీటినిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి, జోనోటిక్ వ్యాధులు చాలా రకాలు గుర్తించినప్పటికి ఈ వ్యాధులు గురించి భయపడాల్సిన అవసరం లేదు. పెంపుడు జంతువులను, పక్షలను శాస్త్రయ పద్ధతులలో అవగాహనతో పోషించడం ద్వారా ఈ వ్యాధులు నివారించవచ్చు. పశుసంవర్ధశాఖ, వైద్య ఆరోగ్యశాఖ ఇతర సంబంధిత శాఖల సహకారంతో ప్రభుత్వం ఈ వ్యాధుల నియంత్రణకు కృషి చేస్తోంది.

మోడల్ మాయా

- జిల్లాలో 490 పాఠశాలల ఏర్పాటు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

మోడల్ స్కూల్స్ పేరిట ప్రభుత్వం విద్యారంగంలో మార్పు తీసుకొస్తానంటూ గ్రామీణ బడులను మూసివేయనుందా అంటే అదే నిజం... మోడల్ మాకొద్దు.. మహాప్రభో.. అంటూ గ్రామీణులు నెత్తినోరుకొట్టుకుంటున్నా... మొండిగా ప్రభుత్వం మోడల్ స్కూల్స్‌ను నడుపుతోంది. జిల్లాలో 490 మోడల్ పాఠశాలను గుర్తించారు. ఈ మేరకు జిల్లాలో అనేక గ్రామీణ బడుల్లోని 2,3,4 తరగతులు మాయమ్యాయి. దాదాపు జిల్లాలో 600లకు పైగా గ్రామీణబడుల్లోని విద్యార్థులను పాఠశాలల విలీనం పేరిట మోడల్ పాఠశాలలకు మార్పు చేస్తున్నారు.

మోడల్ పాఠశాలలను జిల్లాలో 17 గ్రామీణ ప్రాంతాలోని తల్లిదండ్రులు మాత్రమే వ్యతిరేకిస్తున్నట్లు జిల్లా అధికారులు చెబుతున్నా అనేక ప్రాంతాల నుండీ తమ గ్రామ బడులను మార్చొందంటూ జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులకు విద్యార్థుల తల్లిదండ్రుల మొరపెట్టుకుంటున్నారు. అనేక చోట్ల పాఠశాల అభివృద్ధి కమిటీ ఆమోదం తీసుకోకుండా మార్పు చేస్తున్నారంటూ ఆరోపణలున్నాయి. రెండు మూడు కిలో మీటర్ల దూరం తమ పిల్లలన్ని మోడల్ స్కూల్ పేరటి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న బడులకు పంపలేక తమ పిల్లలన్ని బడులు మాన్పించేస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులే స్వయంగా చెబుతున్నారు. అధునాతన విద్య సబ్జెట్‌కు ఓ ఉపాధ్యాయుడు హంగులో తరగతి గదులు ఇలా ఎన్ని చెప్పుకునా తరతరాలుగా నడుస్తున్న తమ గ్రామాల్లోని బడులను మార్చడాన్ని విద్యార్థులకు, విద్యార్థుల తల్లింద్రులకు ఇబ్బందికరంగా మారుతున్న విషయాన్ని అటు ప్రభుత్వం, ఇటు విద్యాశాఖ పట్టించుకోవడం లేదంటూ విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. పతం నెగ్గించుకొని మోడల్ బడుల కోసం ప్రభుత్వం రూ.35 కోట్లు కేటాయించింది.

కుప్పం నియోజకవర్గానికి రూ.3కోట్లు మంజురు చేసింది. మరోవైపు వివిధ కారణాలతో తల్లికి వందనం జిల్లాలో వెయ్యి మంది తల్లుల ఖాతాలో జమకాలేదు. భూమి లేని వారికి భూమి ఉన్నట్లు, విద్యుత్ ఛార్జీలు అధనంగా వస్తున్నాయంటూ చిత్తూరు జిల్లాలో ఇన్‌కమ్ ట్యాక్స్ పేరిట 292, ఈకేవైసి పేటి 223, ప్రభుత్వ ఉద్యోగులంటూ 606 మందికి నేటికీ తల్లికి వందం విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలో జమకాలేదు. ఏది ఏమైనప్పటికి విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్రంగా ఆక్షేపిస్తున్న ప్రాంతాల్లో గ్రామీణబడుల మార్పును మానుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. అలాగే ప్రభుత్వ ఆదేశాల మేరకు తల్లికి వందనం విద్యార్థులందకి వర్తింపజేయాలని కోరుతున్నారు.



తమ గ్రామబడిని మార్చదంటూ కలెక్టరేట్‌కు వచ్చిన విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు (ఫైల్‌ఫోటో)

'ఉపాధి'లో పండ్ల తోటలు..


- జిల్లాలో 5 వేల ఎకరాల్లో సాగు..
- మూడేళ్ల పాటు ప్రభుత్వ సాయం
- సాగు విస్తీర్ణం పెంచేలా చర్యలు
- రేపు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి
- చిత్తూరు జిల్లా డ్వామా పీడీ రవికుమార్



ప్రజాశకి- చిత్తూరు (యాదమరి)

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సన్న, చిన్న కారు మెట్ట భూముల్లో పండ్ల తోటలు సాగుతూ పేద రైతులను ఆర్థికంగా పరిపుష్టి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయి. పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధిశాఖ మరో విన్నూతన కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 8న ఒకే రోజు రైతులకు చెందిన భూముల్లో పండ్ల తోటలో మొక్కలు నాటే కార్యక్రమం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగానే చిత్తూరు జిల్లాలో 5 వేల ఎకరాల్లో పండ్ల తోటలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు చిత్తూరు జిల్లా ఉపాధి హామీ పథక సంచాలకులు ఆవాసాని రవికుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆహారవాణి కూరగాయల పంటల కన్నా పండ్ల తోటల పెంపకంపై రైతులు ఆసక్తి చూపుతున్నారని, ప్రభుత్వం కూడా రైతులకు సహకారం అందిస్తుండడంతో ఈ సాగుపై మక్కువ పెరిగిందని తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం ద్వారా తోటల పెంపకానికి ప్రోత్సహించేందుకు ప్రత్యేక ప్రణాళికతో క్షేత్రస్థాయిలో రైతుల భూములలో ఈనెల 8వ తేదీ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టేందుకు అన్ని ఏర్పాటు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

జిల్లా వ్యాప్తంగా 2025 -26 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 31 మండలాల్లో 5వేల ఎకరాల్లో వివిధ రకాలైన పండ్ల తోటల పెంపకం లక్ష్యంగా చేపడుతున్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీలుగా నమోదై జాబు కార్డులతో పనులు చేస్తున్న రైతులు ఈ పథకానికి అర్హులు. ఐదు ఎకరాల లోపు వ్యవసాయ భూములు కలిగిన ఎస్సీ, ఎస్టీలతో పాటు ఇతర వర్గాల రైతులకు ఈ పథకం వర్తిస్తుంది. ఉపాధి హామీ కింద రైతులకు మామిడి, సీతాఫలం, మునగ, జామ, దానిమ్మ, కొబ్బరి, సపోటా, బత్తాయి, అల్లి నేరేడు, డ్రాగన్ ఫ్రూట్, వివిధ రకాలైన మొక్కలు రైతులు పెంచుకోవచ్చు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా సన్న చిన్న కారు రైతులకు ఫలసాయం అందుతుంది. అరకొర నీటి వసతి ఉన్న మెట్ట భూముల్లో పండ్లతోటల సాగుతో పేద రైతులను ఆర్థికంగా పరిపుష్టి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. పండ్ల మొక్కలు నాటిన మూడేళ్ల వరకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుంది. రైతుల భూములలో మొక్కలు నాటేందుకు గుంతలు తీయడం మొదలుకొని మొక్కలు పెరిగేంతవరకు దాదాపు అన్ని ఖర్చులు అందిస్తుంది. పెంపకంకు గుంతలు తవ్వకం మొక్కలు కొనుగోలు, నీళ్లు ఎరువుల ఖర్చులకు, మూడేళ్ల వరకు ఎకరానికి దాదాపు లక్ష రూపాయల వరకు ప్రభుత్వం చెల్లిస్తుంది.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

గ్రామీణాభివృద్ధి శాఖ - జిల్లా నీటియాజమాన్య సంస్థ -

పండ్ల తోటలు వేసుకునే రైతులకు శుభవార్త!

ఉపాధి హామీ పథకంలో ఉచితంగా పండ్ల తోటల పెంపకం

సన్న - చిన్న కారు రైతులు (5 ఎకరాలలోపు) అర్హులు

మామిడి	ఎకరానికి రూ.1,09,950	పూర్తి ఉచితం
జామ	ఎకరానికి రూ.1,46,971	పూర్తి ఉచితం
నిమ్మ	ఎకరానికి రూ. 1,46,311	పూర్తి ఉచితం
సపోట	ఎకరానికి రూ. 95,584	పూర్తి ఉచితం
దానిమ్మ	ఎకరానికి రూ.2,16,417	పూర్తి ఉచితం
డ్రాగన్ ఫ్రూట్	0.5 ఎకరానికి రూ.2,00,714	పూర్తి ఉచితం
కొబ్బరి	ఎకరానికి రూ. 99,183	పూర్తి ఉచితం
ఆయిల్ పామ్	ఎకరానికి రూ.55,770	పూర్తి ఉచితం
ఆపిల్ బేర్	ఎకరానికి రూ.1,26,186	పూర్తి ఉచితం
మునగ	0.25 ఎకరానికి రూ. 27,515	పూర్తి ఉచితం
మల్లి	0.25 ఎకరానికి రూ. 55,124	పూర్తి ఉచితం
గులాబి	0.25 ఎకరానికి రూ. 62,355	పూర్తి ఉచితం

మరిన్ని వివరములకు : మీ యమ్.పి.డి.ఓ. వారిని / ఉపాధి హామి ఎ.పి.ఓ. మరియు సిబ్బందిని సంప్రదించగలరు.

మీ గ్రామ సచివాలయ హార్టికల్చర్ అసిస్టెంట్/అగ్రికల్చర్ అసిస్టెంట్ మరియు పీల్డ్ అసిస్టెంట్ ని గాని సంప్రదించగలరు.

దరఖాస్తు ఇలా...

ఉపాధి హామీలు పండ్ల తోటలు, పూల తోటలు పెంచుకునే రైతులు జాబ్ కార్డు కలిగి ఉండాలి. ఐదు ఎకరాలు పొలం కన్నా తక్కువ పట్టా భూమి కలిగి ఉండాలి. రైతు పట్టాదారు పాసుపుస్తకం, వన్ బి, మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు.

ఉపాధి సిబ్బంది భాగస్వామ్యం కావాలి..

- ఆవాసాని రవికుమార్, చిత్తూరు జిల్లా ఉపాధి హామీ పథక సంచాలకులు



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పిలుపుమేరకు జూలై 8వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి హామీ ద్వారా మంజూరైన పండ్ల తోటల పెంపకంను, రైతుల భూములు మొక్కలు నాటే కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో పెద్ద ఎత్తున చిత్తూరు జిల్లాలో చేపట్టనున్నాం. ఇందులో జిల్లాలోని అన్ని మండలాల్లో ఉపాధి హామీ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది, వారికి కేటాయించిన గ్రామాల్లో పర్యటించి రైతుల భూముల్లో మొక్కలు నాటించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

మామిడి రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ

మాజీ ఎమ్మెల్యే లలిత కుమారి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లలిత కుమారి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మామిడి రైతులకు అండగా వైఎస్‌ఆర్సిపి ఉంటుందని మాజీ ఎమ్మెల్యేలు లలిత కుమారి, సునీల్ కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని పాలేరు పంచాయతీలో వైసిపి కార్యకర్తల సమావేశం మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 9వ తేదీన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మామిడి రైతులను పరామర్శించేందుకు జిల్లాకు వస్తున్నారని తెలిపారు. ఈ సమావేశానికి కార్యకర్తలు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జడ్పీ మాజీ చైర్మన్ కుమార్ రాజా, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, థామస్, ప్రకాష్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబు ఏం చేసినా ప్రజాహితం కోసమే..!

మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు

ప్రజాశక్తి- రామకుప్పం: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏం చేసినా ప్రజాహితం కోసమే చేస్తారని మాజీ శాసనమండలి సభ్యులు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గౌని వారి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన చేస్తూ.. గత ప్రభుత్వం ప్రజలను వేధించడానికి పలు కార్యక్రమాలను రద్దు చేసిందని గుర్తు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజాహిత కార్యక్రమాలను మాత్రమే చేపట్టడం జరుగుతున్నదని తెలిపారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన రివర్స్ టెండర్రింగ్ విధానాన్ని రద్దు చేయడం జరిగిందన్నారు. ఆ విధానంలో దోచుకోవడం తప్ప సాధించింది ఏమీ లేదన్నారు. రాష్ట్రంలో పేదరికం నిర్మూలనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూర దృష్టితో పి4 విధానాన్ని తీసుకువచ్చారన్నారు. ఈ విధానం ద్వారా పేదరిక నిర్మూలనకు ముఖ్యమంత్రి, మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించాలే కాని విమర్శించడం తగదన్నారు.

పలువురికి నారాయణస్వామి పరామర్శ



ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని కొండకిందపల్లి గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకుడు మోహన్ రెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సిఎం కె.నారాయణస్వామి, రాష్ట్ర వైసిపి అడ్వైజర్ కమిటీ సభ్యులు కె.నారాయణ స్వామి స్థానిక నాయకులతో కలిసి వారిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని పరామర్శించి ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో తిరగాలని ఆకాంక్షించారు. అలాగే అగ్గి చేనుపల్లిలో అబ్బయ్యన్న ఇటీవల అనారోగ్యానికి గురి కావడంతో ఆదివారం గ్రామానికి వెళ్లి పరామర్శించారు. వైద్యం కోసం ఎలాంటి సహాయ సహకారాలు అయినా అందిస్తామని చెప్పారు.

ఘనంగా పీర్ల ఊరేగింపు

షియా ముస్లిముల రక్తతర్పణం



ప్రజాశక్తి- గంగాధరనెల్లూరు: మండల పరిధిలోని ఆవల కొండలో మొహరం పండుగ సందర్భంగా షియా ముస్లింలు పీర్లను ఊరేగించి రక్తతర్పణం నిర్వహించారు. పూర్వం యజీద్ అనే పాలకుడు ఇమామ్ హుస్సేన్ అతని కుటుంబ సభ్యులతో పాటు అనుచరులు, అభిమానులను కొంతమందిని బలిగొన్నారు. వీరి ప్రాణత్యాగాన్ని గుర్తించుకుంటూ, తూగుండ్రం పంచాయతీ ఆవలకొండలోని అంజుమన్ అబ్బాసియా కమిటీ ఆధ్వర్యంలో మతగురువులు మౌలానా అబుదాలి, మౌలానా కుమేల్ అబ్బాస్, పలువురు ముస్లింలు ఆదివారం నల్లబట్టలు ధరించి పీర్లు ఊరేగిస్తూ తమ ఛాతిపై, వీపుపై రక్తగాయాలు చేసుకుని రక్తాన్ని చిందిస్తూ ఇమామ్ హుస్సేన్ సేవలను స్మరిస్తూ ర్యాలీ నిర్వహించారు. పీర్లుతో అగ్ని గుండం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి బాలగంగనపల్లె, గంగాధర నెల్లూరు అబ్బాస్ కాలనీ, పాలసముద్రం, కనికాపురం, చిత్తూరుతోపాటు, తమిళనాడు రాష్ట్రం నుంచి సైతం భారీ ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు. సీఐ శ్రీనివాసంతి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రేబిస్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి



చిత్తూరులో..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పెంపుడు జంతువులు, పక్షుల నుంచి మనుషులకు వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని పశుసంవర్ధశాఖ జాయింట్ డైరెక్టర్ అబ్బుల్ ఆరిఫ్ సూచించారు. ప్రపంచ జోనోసిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక పశువైద్యశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో జెడి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ లోకేష్, పశు వైద్యశాల అధికారిని డిడి ఏహెచ్ విపిసి డాక్టర్ సుబ్బమ్మ పాల్గొని మాట్లాడారు. ప్రతి సంవత్సరం జూలై 6వ తేదీ రేబిస్ వ్యాధి నిరోధక టీకా మందు కనుగొన్న లూయిస్ జ్ఞాపకార్థం ప్రపంచ జోనోసిస్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. పెంపుడు జంతువులు, పక్షుల నుండి మనుషులకు 280 రకాల వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ముఖ్యంగా పిచ్చికుక్క నుండి వ్యాపించే రెబిస్ వ్యాధి అత్యంత భయంకరమైందని ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు. పెంపుడు జంతువులు పక్షుల నుండి మనుషులకు వ్యాధులు రాకుండా వ్యక్తిగత శుభ్రత పాటించడంతోపాటు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మరగపెట్టిన పాలను తాగడం, బాగా ఉడికించిన గుడ్లు, మాంసం తీసుకోవాలన్నారు. పశువుల కొట్టాల వద్ద నీటి నిలువలు ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సమావేశం అనంతరం పెంపుడు జంతువులకు రెబిస్ వ్యాధి టీకాలను పశుసంవర్ధక శాఖ జెడి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ లోకేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారులు సిబ్బంది, మున్సిపల్ ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

61 కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు



సోమలలో..



ఎస్ఆర్ పురంలో..

సోమల: ప్రపంచ సంక్రమిత వ్యాధుల నిరోధక దినోత్సవం సందర్భంగా మండలంలోని పశువైద్య కేంద్రాలలో 61 కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలను వేసినట్టు కందూరు పశువైద్యాధికారిని చందన ప్రియ తెలిపారు. జోనోసిస్ వ్యాధి అనేది పశువుల నుండి మనుషులకు సంక్రమించే అంటు వ్యాధులు మనుషులకు జంతువుల నుండి సంక్రమించే వ్యాధులు అని వీటి నివారణ కొరకు వ్యక్తిగత పరిశుభ్రత పెంపుడు కుక్కలకు టీకాలు వేయించడం వంటి జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

ఎస్ ఆర్ పురం: పెంపుడు జంతువుల ఆరోగ్యకరమైన జీవనం కోసం వ్యాధులు నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారిని శ్రీవిద్య అన్నారు. ఆదివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా తయ్యూరు పశువైద్య కార్యాలయంలో ఆసుపత్రిలో పెంపుడు జంతువులకు టీకాలు వేశారు.

సిద్ధేశ్వర స్వామిని దర్శించుకున్న అనిల్



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని పాతూరు నాతం గ్రామంలో వెలసి ఉన్న సిద్ధేశ్వర స్వామి దేవస్థానంలో శ్రావణ మొదటి ఏకాదశి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డీజే అనిల్, మాజీ ఎంపీపీ ఐరాల కృష్ణవేణి జైకుమార్ గ్రామంలోని స్వామివారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. వీరికి పురోహితులు స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. ఆరేళ్ల జయప్ప, నాగభూషణం గౌడ్, శివకుమార్, గౌరప్ప పాల్గొన్నారు.

వైభవంగా అగ్నిగుండ ప్రవేశం

ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరంలో వెలసి ఉన్న శ్రీద్రౌపది సమేత ధర్మరాజులస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం అగ్నిగుండం ప్రవేశంతో వైభవంగా ముగిసింది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు కర్పూర హారతులు పట్టారు. మహిళలు అమ్మవారికి పొంగళ్ళు వండి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం కంకణాలు ధరించిన భక్తులు ఆలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన అగ్ని గుండంలో దిగారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రవి యాదవ్, ప్రధాన కార్యదర్శి గౌతమ్ రాజు, ఉపాధ్యక్షుడు కట్లరవిరెడ్డి, కోశాధికారి లక్ష్మీపతి, ఉప కోశాధికారి సాయిరాయల్, అర్చకులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు

ప్రజాశక్తి-పెద్దపంజాణి: స్థానిక ఎస్సై ధనుంజయ రెడ్డి పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాజుపల్లి గ్రామంలో పర్యటించారు. ఈసందర్భంగా దేవాలయాలకు రక్షణగా సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించడంతో ఆస్ట్రేలియాలో స్థిరపడ్డ రాజుపల్లి గ్రామానికి చెందిన ఏ.జయరాం రెడ్డి రాజుపల్లి ముత్యాలమ్మ గుడికి సీసీ కెమెరాలు అమర్చారు. అలాగే గ్రామాల్లో ప్రధాన ఆలయాలు ముందు సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు.


పెండింగ్ ప్రాజెక్టులకు నిధులివ్వండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు మంజూరయ్యేలా చొరవ చూపాలని జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కోరారు. మంత్రి ఆదివారం తిరుపతికి విచ్చేసిన సందర్భంగా సుధీర్ రెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గానికి సంబంధించిన అభివద్ధి, పెండింగ్ పనులను మంత్రి ముందు ఉంచారు. సుపరిపాలనకు- తొలి అడుగు కార్యక్రమం జరుగుతున్న తీరును మంత్రికి వివరించారు.

హర్షా టయోటా నూతన షోరూం ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): తిరుపతిలోని కరకంబాడి రోడ్‌లో హర్షా టయోటా కొత్త షోరూమ్‌ను ప్రారంభించారు. ఇప్పటికే హర్షా టయోటా అనేక మంది కస్టమర్లకు సేవలందిస్తూ విశ్వాసాన్ని పొందింది. ఈ కొత్త బ్రాంచ్ ద్వారా వారు తమ సేవలను మరింత విస్తరించి, తిరుపతిలో కస్టమర్లకు ఇంకా చేరువవుతారని నమ్మకం ఉంది. ఈ కార్యక్రమంలో ఆర్‌టిఒ మురళీమోహన్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు శ్రీరామ్ కిషోర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలి : ఎమ్మెల్యే




ఐరాలలో ఎమ్మెల్యే మురళీ మోహన్

ప్రజాశక్తి- ఐరాల: సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఐరాల మండలంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా పందికొట్టూరు గ్రామాన్ని సందర్శించిన ఎమ్మెల్యే గ్రామమహిళలతో మాట్లాడి మహిళల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్న సంక్షేమ పథకాలపై వారికి అవగాహన కల్పించారు. నియోజకవర్గం పరిశీలకులు బొమ్మన శ్రీధర్, మండల అధ్యక్షులు గంగారపు హరిబాబు నాయుడు, నియోజకవర్గం పోల్ మేనేజ్మెంట్ అధ్యక్షులు గిరిధర్ బాబు, ఐరాల జెడ్పీటీసీ సుచిత్ర కన్నయ్య నాయుడు, కాణిపాకం మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ జెడ్పీటీసీ లతా బాబునాయుడు, కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

కుప్పం రూరల్ : కుప్పం పట్టణం మోడ్రన్ కాలనీ, దలవాయి కొత్తపల్లి ప్రాంతాలలో 11వ క్లస్టర్ ఇంచార్జ్ కన్నన్ ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల సమస్యలను విచారిస్తూ, తెలుగుదేశం ప్రభుత్వం అందిస్తున్న పరిపాలనపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. 11వ క్లస్టర్ ఇన్చార్జి తిరుమగళ్, డీకేపల్లి యూనిట్ ఇంచార్జ్ నబి, బూత్ కన్వీనియర్ గనివుల్లా, కో కన్వీనర్ అంజద్, ఎస్టీ సెల్ అధ్యక్షులు నాగభూషణం, మైనారిటీ యూత్ అధ్యక్షులు అస్లాం పాల్గొన్నారు.

కార్వేటినగరం: మండల పరిధిలోని ఆదివారం నిర్వహించిన సుపరిపాలన కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని మండల అధ్యక్షులు చెంగల్ర యాదవ్ రాజా, జనార్ధన్ రాజు తెలిపారు. ఎల్ఆర్ పేట, బిసి కాలనీలోని పర్యటించి ప్రజలకు కరపత్రాలు పంచిపెట్టారు. రాజేందర్ రెడ్డి, బీగాల రమేష్ అన్నమలై, గణేష్ రాజు, రామచంద్ర రాజు, మునిరత్నం, హేమంత్ రెడ్డి పాల్గొన్నారు.

19 మందికి సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే గురజాల

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : చిత్తూరు నియోజకవర్గంలో 19 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పంపిణీ చేశారు. ఆదివారం సాయంత్రం లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే వారి కార్యాలయం ప్రజాదర్బార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను సంబంధిత లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో చికిత్స పొందిన వారికి ఆర్థికంగా సాయం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయుక్తంగా ఉందన్నారు. మొత్తం 19 మంది లబ్ధిదారులకు సంబంధించి రూ.13,75,362ల మెగా చెక్కును అందించారు. నియోజకవర్గపరిధిలో చిత్తూరు అర్బన్‌కి సంబంధించి 9మంది, చిత్తూరు రూరల్ సంబంధించి 7 మంది, గుడిపాల మండలం పరిధిలో ముగ్గురికి చెక్కులను పంపిణీ చేశారు. టిడిపి నాయకులు కాజూరు బాలాజీ, జయచంద్ర నాయుడు, ఈశ్వర్, మోహన్ రాజ్, సీఎం విజయ, రఘు, విజయేంద్రవర్మ, వరద, మోహన్‌రెడ్డి, కంద పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి బాబూ జగ్జీవన్ రామ్ కృషి



ప్రజాశక్తి -తిరుపతి సిటీ: సమాజాభివృద్ధికి బాబూ జగ్జీవన్ రామ్ విశేష కృషి చేశారని ఎపిఎస్ పిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు పేర్కొన్నారు. డిస్కమ్ కార్పొరేట్ కార్యాలయం (విద్యుత్ నిలయం)లో ఆదివారం బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎండి సంతోష రావు మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ సుదీర్ఘకాలంపాటు దేశ వ్యవహారాల్లో ప్రధాన పాత్ర పోషించారన్నారు. ఆయన కేంద్ర వ్యవసాయశాఖా మంత్రిగా కొనసాగిన సమయంలో దేశంలో ఆహార సమస్య పరిష్కారానికి అవిరళ కృషి చేశారన్నారు. అలాగే రక్షణ శాఖా మంత్రిగా వున్నప్పుడు బంగ్లాదేశ్ సమస్యను చాకచక్యంగా పరిష్కరించారని తెలిపారు. సంస్థ ఉద్యోగులు మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని సంస్థ అభివద్ధికి తమవంతు సహకారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కే. గురవయ్య, పి. అయూబ్ ఖాన్, జనరల్ మేనేజర్ వై. వెంకటరాజు పాల్గొన్నారు. తిరుపతి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విక్రమ్ కుమార్ రెడ్డి, కేశవాయనగుంట జగజీవన్ రామ్ పార్కు నందు ప్రతిష్ఠించిన విగ్రహానికి ఆదివారం పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఉప సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శ్యాం సుందర్ రావు, సత్యవేడు ఉప సంక్షేమ శాఖ అధికారి శేఖర్ బాబు, వార్డెన్స్ చందన, ప్రసూన, మంజుల, శశికళ , ,బాబు రెడ్డి నివాళి అర్పించారు.

స్విమ్స్ కార్మికుల విజయం

అధికారుల హామీతో దీక్షలు విరమణ



అధికారుల హామీతో రిలే దీక్షలు విరమించిన స్విమ్స్ కార్మికులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: స్విమ్స్ ఆస్పత్రిలో మూడు దశాబ్దాలకు పైగా పనిచేస్తున్న వార్డుబాయిలు తమకు వేతనాలను పెంచడంలోనూ, హోదాను నిర్ణయించడంలోనూ వివక్ష పాటిస్తున్నారని రెండేళ్లుగా టిటిడి కాంట్రాక్టు కార్మికులు వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తూనే వచ్చారు. జూన్ 4న సమ్మె నోటీసు ఇచ్చి ఆందోళన ప్రారంభించిన కార్మికులు జులై 5న శనివారం రాత్రి అధికారుల హామీతో దీక్షలను విరమించారు. పది రోజులుగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు స్విమ్స్ డైరెక్టర్, ఎఎస్‌పి, ఆర్‌డిఒ, విజిఒ, టిటిడి ఉన్నతాధికారులు నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. ఇది స్విమ్స్ కార్మికుల ఘన విజయం అని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిబిఎస్ మణ్యం, కందారపు మురళి అన్నారు. శుక్రవారం టిటిడి ఈవో శ్యామలరావు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తిరుపతి పద్మావతి అతిథిగృహంలో సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారని, కార్మికుల సమస్యలపై సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని నిర్ణయించారని తెలిపారు. శనివారం మధ్యాహం సిఐటియు నేతలతో కలిసి ఆర్డీవో కార్యాలయంలో చర్చలు జరిగాయి. శనివారం రాత్రి డైరెక్టర్ ఆర్‌వి కుమార్, ఆర్డీవో రామ్మోహన్‌రెడ్డి, ఎఎస్‌పి రవి మనోహరాచారి, టిటిడి ఎఫ్ఎ అండ్ సిఎఒ రవిప్రసాద్, డిప్యూటీ ఈవో గోవిందరాజులు, విజిఒ సదాలక్ష్మి, లక్ష్మి శ్రీనివాస కార్పొరేషన్ జిఎం రాంకుమార్, స్విమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ దీక్షా శిబిరం వద్దకు విచ్చేసి, స్పష్టమైన హామీ ఇచ్చి, దీక్షలను విరమింపజేశారు. నాయకులు టి సుబ్రమణ్యం, కే వేణుగోపాల్, మాధవ్,బుజ్జి యూనియన్ నేతలు రవి, సూరి, మారి ముత్తు, గోపి, వేలు, కోటయ్య, జయమ్మ, కుమారి, రజనీకాంత్, వెంకటేశు, మునికష్ణ, భాష, సుబ్రహ్మణ్యం తదితరులు ప్రసంగించారు.

సార్వత్రిక సమ్మెకు సంఘీభావంగా బైకు ర్యాలీ



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి, యంత్రాంగం: మోడీ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 9వ తేదీన చేపట్టబోయే దేశ వ్యాప్త కార్మికకర్షక సమ్మెకు సంఘీభావంగా కార్మిక సంఘాలు ఆదివారం పట్టణంలో నిర్వహించిన బైకు ర్యాలీ జయప్రదమైంది. స్థానిక పంచాయతీరాజ్ అతిథి గహం నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ జరిగింది. సిఐటియు జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, ఏఐటీయూసీ అనుబంధ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కత్తిరవిలు మోడీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సంయుక్తంగా ధ్వజమెత్తారు. కార్మికులను కట్టు బానిసలుగా చేసే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. దేశ ప్రజల ప్రయోజనాలను పక్కనపెట్టి కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న మోడీ రాజీనామా చేయాలన్నారు. సీఐటీయూ నాయకులు అంగేరి పుల్లయ్య, గంధం మణి, వెంకటేష్, వేణు, కార్తీక్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

– తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో టిటిడి ఎస్‌డబ్ల్యుఎఫ్ సిఐటియు నాయకులు గోల్కొండ వెంకటేష్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. గోల్కొండ వెంకటేష్ మాట్లాడుతూ సిపిఎస్ విధానాన్ని ప్రవేశపెట్టి లక్షలాది మంది ఉద్యోగులకు పెన్షన్ లేకుండా చేసి వారి హక్కులను హరింపజేశారన్నారు. పోరాడి సాధించుకున్న 8 గంటల పనిని 12 గంటలకు పెంచడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు పిఆర్‌సి, డిఎ ఇవ్వకూడదనే దుర్మార్గమైన చట్టాన్ని పార్లమెంట్‌లో చట్టం చేశారన్నారు. మహిళలు నైట్ షిఫ్ట్ పనిచేయాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం చేసిందన్నారు. విశాఖ ఉక్కును అంబానీ, అదానీలకు కట్టబెట్టాలని చూస్తున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు కాటా గుణశేఖర్, పట్నం దయాకర్, నైనారు పద్మనాభం, గోవిందప్ప, బాలాజీ, మోహన్, రవీంద్ర పాల్గొన్నారు.

– పుత్తూరు టౌన్‌లో.. అంబేద్కర్ భవన్‌లో ఏఐటియుసి పుత్తూరు ప్రాంత కార్యకర్తల సమావేశం హేమావతి అధ్యక్షతన జరిగింది.. ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సమ్మెలో పాల్గొని కార్మిక సత్తా చాటాలని పిలుపునిచ్చారు. మహేష్, గోపి పాల్గొన్నారు.

– బిఎన్ కండ్రిగలో కుక్కంబాకం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామ కమిటీ సమావేశం జరిగింది. కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించి, రోజుకు 600 రూపాయల వేతనం కల్పించాలని, బడ్జెట్లో ఉపాధి హామీ నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేకే రమణయ్య, కృష్ణమ్మ, సుజాత, మల్లేశ్వరి పాల్గొన్నారు.

– వెంకటగిరి టౌన్‌లో.. ఐదో వార్డు ఏరియాలో సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, పెంచలయ్య, సుబ్రమణ్యం, ఇందిరమ్మ, శేషయ్య పాల్గొన్నారు.

అక్రమ తోడేళ్లకు అడ్డేది..?

సహజ వనరులు ఆవిరి
ప్రభుత్వ ఆదాయానికి గండి
అధికారుల నిఘా ఎక్కడ?


ప్రజాశక్తి -ఏర్పేడు

కాలువల్లో చెరువుల్లో ఇసుక, మట్టిని అక్రమంగా తరలించడంతో రాను రాను సహజ వనరులు ఆవిరైపోయి పర్యావరణానికి తూట్లు పొడుస్తున్నారు. ప్రకతి వనరులు మానవ అవసరాలను తీర్చడానికే గాని అత్యాశ తీర్చడానికి కాదు. అయితే కొందరు అధికార అండ చూసుకుని చెరువులు, కాలవలును గుల్ల చేస్తున్నారు. మైనింగ్ మాఫియాతో కొందరు ఎంతటి దారుణానికైనా పాల్పడుతున్నారు. మరి కొందరు అనుమతులు గోరంత తీసుకుని కొండంత తవ్వేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏర్పేడు మండలంలో మట్టి ఇసుక తవ్వకాలే ఇందుకు నిదర్శనం.



మేర్లపాక తామర గుంట చెరువులో ఎక్స్‌వేటర్ల సహాయంతో ..

మండలంలో ఐఐటి, ఐజర్ విశ్వవిద్యాలయాలు, స్కూల, సూక్ష్మ పరిశ్రమలు, జాతీయ రహదారులు, విమానాశ్రయం, టోల్ ప్లాజాలు వంటివి ఏర్పడడంతో భూములకు రెక్కలొచ్చి రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకొంది. దీంతో ప్రైవేట్ సంస్థలు చొరబడి కమర్షియల్ ప్లాట్ల నిర్మాణాలు ఎక్కువగా చేపట్టడంతో అక్రమ మాఫియా మట్టి, ఇసుకను అడ్డగోలుగా తోడేస్తున్నారు. చెరువులు, చిన్న పెద్ద కాలువలని తేడా లేకుండా స్వర్ణముఖి నది నుండి ఇసుకను, ఆయా ప్రాంతాల చెరువులలోని మట్టిని, గుళ్ళ ఇసుకను అక్రమంగా వెంచర్లకు, ప్లాట్లకు రవాణా చేసి అధిక మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. అక్రమ మాఫియా సహజ వనరులను ట్రాక్టర్లు తో గ్రామాల మీదుగా అతివేగంతో తరలించడంతో నివాసులు బెంబేలెత్తిపోతున్నారు. ఆయా గ్రామాలలోని అక్రమ మాఫియా సహజ వనరులను దోచుకోపోతుంటే అధికారులు ఏం చేస్తున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. సచివాలయం వ్యవస్థ ప్రతి పంచాయతీలలో విధులు నిర్వహిస్తున్నది. ఈ వ్యవస్థ సహాయంతో అక్రమ సహజ వనరుల దోపిడీకి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



మేర్లపాక రిజర్వాయర్ కలుజులో మట్టిని అక్రమంగా తవ్వేయడంతో హై టెన్షన్ పోల్ కు పెను ప్రమాదం ఏర్పడనున్న దృశ్యం



టెన్త్, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన జర్నలిస్టుల పిల్లలు

విద్యతోనే ఉజ్వల భవిష్యత్ : ఎంఎల్‌సి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు పొందవచ్చని ఎమ్మెల్సీ, రష్ ఆసుపత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన పబ్లిక్ పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన జర్నలిస్టు పిల్లలకు ప్రతిభ పురస్కారాలను ఆదివారం అందజేశారు. మొత్తం 27 మంది విద్యార్థులకు నగదుతో కూడిన ఈ అవార్డులను ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య పట్ల ప్రతి ఒక్కరు ఇష్టాన్ని పెంచుకోవాలన్నారు. చిన్నతనం నుంచి లక్ష్యం పెట్టుకుని చదవాలని చెప్పారు. ఆ లక్ష్యానికి అనుగుణంగా కష్టపడి ఉన్నత చదువులు వైపు అడుగులు వేయాలన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మురళి, బాలచంద్ర మాట్లాడుతూ జర్నలిస్టు పిల్లలను ప్రోత్సహించాలని, విద్యతో కలిగే ప్రయోజనాలను తెలియ చెప్పాలన్న సంకల్పంతోనే ఈ అవార్డుల కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు లావణ్య కుమార్, జాయింట్ సెక్రటరీ జగదీష్, విజయ్ యాదవ్ పాల్గొన్నారు.